క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 41, పచ్చకాకర 23, పందిరి బీర 18, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 16, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 28, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

30న మెగా జాబ్‌మేళా

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని డాన్‌బాస్కో దిశ ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, స్టీఫెన్ ఓ ప్రకటనలో తెలిపారు. చర్చి ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే జాబ్‌మేళాలో రిలయన్స్, శుభగృహ, అపోలో ఫార్మసీ, ది ముత్తూట్ గ్రూప్ వంటి దాదాపు 25 కంపెనీలకు చెందిన ప్రముఖులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్హత వారికి అవకాశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 94940 92219, 94946 98219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆంథోని వినయ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫ్రెషర్స్ డే ఉత్సవాలు సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరూ కలిసిమెలిసి చదువుకునేందుకు ఎంతో దోహదపడతాయన్నారు.

మహిళలకు సాధికారత అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: రిజర్వేషన్లతో పాటు మహిళలకు సాధికారత అవసరమని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ, యువజన జేఏసీ చైర్మన్ వేణుకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కోట అవసరమని, మంత్రివర్గంలోనూ సరైన సంఖ్యలో మహిళ మంత్రులను నియమించాలన్నారు. సాధికారతలేని మహిళ రిజర్వేషన్లు నిరుపయోగమన్నారు.

వర్షం.. జలమయం



లాలాపేట: నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లాలాపేట ప్రధాన రహదారి అంబేడ్కర్ విగ్రహం వద్ద, లాలాపేట బస్‌షెల్టర్ తో పాటు కాలనీ, బస్తీ అంతర్గత రోడ్లపై వరద పారింది. పాదచారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులతో పాటు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు తడిసి ముద్దయ్యారు.

ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో హాకథాన్-2023



ఈవెంట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ దయానంద్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో తొలిసారిగా ఓయూసీఈ హాకథాన్–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం కాలేజీ అసెంబ్లీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని వనిత స్టూల్స్ అండ్ అండ్ క్రాఫ్ట్ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. వచ్చే నెల ఢిల్లీలో జరిగే స్మార్ట్ ఇండియా హాకథాన్–2023 పోటీలలో విద్యార్థులు పాల్గొనేందుకు శిక్షణ ఇచ్చేందుకు ఓయూసీఈ హాకథాన్ పోటీలను నిర్వహించిన్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొత్త ఐడియాలను వెలికితీసేందుకు నిర్వహించిన పోటీలలో రోబోటిక్, డ్రోన్, నూతన యాప్‌లను అభివృద్ధి చేసి ప్రదర్శించినట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరచిన ఐదు బృందాలను ఎంపిక చేసి ఢిల్లీలో జరిగే పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. సాయంత్రం జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. డీఆర్‌డీవో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ గాస్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, మోహీనుద్దీన్, రాజీవ్‌కుమార్, వేణు, నాగరాజు పాల్గొన్నారు.



బల్కంపేటలో గణేశుడిని దర్శించుకున్న రవీందర్‌గౌడ్



శ్రీకృష్ణ భజన మందిర్‌లో జరిగిన అన్నదానంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప



జైజై గణేశా.. జయములివ్వు గణేశా..

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యలకు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాల్లో అన్నదానాలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లోని వినాయకులను ప్రజాప్రతినిధులు, అధికారులు, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



సనత్‌నగర్‌లో గణనాథుడి దర్శించుకున్న వెల్లాల రామ్మోహన్



మోడల్‌కాలనీలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు



మోడల్‌కాలనీ గణనాథుడి వద్ద మహిళలు



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..



గణనాథుడి పూజలో పాల్గొన్న బండారి లత



పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ జీవకన్



సిక్‌విలేజ్ యువజన సంఘం అధ్వర్యంలో..



తార్నాక చింతల్ బస్తీలో..

బిల్లులు చెల్లించకుంటే పనులు నిలిపివేస్తాం



ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

లాలాపేట: చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదంటూ బుధవారం సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జనవరి నుంచి ఇప్పటి వరకు పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పనులు చేసిన కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించలేక కొందరు కాంట్రాక్టర్లు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని లేకుంటే అక్టోబర్ 1 నుంచి పనులన్నింటినీ నిలిపివేస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్, వీరేష్ ఉన్నారు.

రోడ్డు పక్కన గుర్తు తెలియని యువకుడి మృతదేహం



రాంగోపాల్‌పేట్: రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై దీక్షిత్ రెడ్డి వివరాల ప్రకారం.. బోయిగూడ సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం వద్ద ఓ యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. మృతుడికి 25–30 ఏళ్ల వయస్సు ఉంటుందని బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమచేతిపై అమ్మ, కుడిచేతిపై అశ్విత అనే తెలుగులో ట్యాటూ ఉంది. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

శోభాయాత్ర మార్గాల్లో వైద్య శిబిరాలు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి

రాంగోపాల్‌పేట్: గణేష్ నిమజ్జన శోభాయాత్ర జరిగే మార్గాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే చికిత్స అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి 108 అంబులెన్సులు, ప్రైవేటు అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితి తలెత్తితే వైద్య సేవలు అందించేందుకు వీలుగా కార్పొరేట్ ఆస్పత్రులను సైతం సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి కంట్రోల్ రూమ్‌లో ఒక సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారి ఉండి నిరంతరం ఆరోగ్య సేవలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 వైద్య శిబిరాలు, బేబీ పాండ్స్ వద్ద కూడా అంబులెన్స్‌లను అందుబాటులో ఉంటాయన్నారు.

కొండా లక్ష్మణ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదవారి సాయితేజ కోరారు. కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ నేతలు రాజేష్, కరుణాకర్, కిరణ్‌యాదవ్, సంతోష్, మహేష్, మనోజ్, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు రాజునేత, బాలకృష్ణనేత ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పించారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాయితేజ

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు



నిరంజన్ రెడ్డిని కలిసిన సభ్యులు

రసూల్‌పురా: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని బుధవారం బోయిన్‌పల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరిక ఆనంద్ ఆధ్వర్యంలో పలువురు కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. టాయిలెట్లు, సెక్యూరిటీ రోడ్లు, డ్రైనేజీ, పింఛన్ రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సభ్యులు మాడిశెట్టి గిరిధర్, దేవుల పల్లి శ్రీనివాస్, మీనా భాస్కర్, నారాయణ, జవహర్, భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి పాటుపడాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి తలసాని



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు దేవాలయ అభివృద్ధికి పాటు పడాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బుధవారం రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయం, కాశీ విశ్వనాథ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక సీఎం కేసీఆర్ రాష్ట్రంలో దేవాలయాలు ఎంతో అభివృద్ధి చేశారని యాదగిరిగుట్ట దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయ పాలక మండలి చైర్మన్‌గా తేజావత్ రాజ్‌కుమార్ సింగ్, సభ్యులుగా అజయ్ ఆనందర్, రాపోలు సోమయ్య, బీ విక్రం, భాగ్య, సాయి తేజ, సందీప్ కుమార్, ఎక్స్ అఫీసియో సభ్యులుగా రాజగోపాలచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాశీ విశ్వనాథ స్వామి దేవాలయ చైర్మన్‌గా అజయ్, సభ్యులుగా ఎంవీ రామ్మోహన్, గట్ల శ్రీనివాస్, నర్సింహారావు, అనిత, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఎక్స్ అఫీసియో సభ్యులుగా భాస్కరబట్ల విశ్వనాథ శర్మలు ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన భవనం ప్రారంభం..

రాంగోపాల్‌పేట్: మారేడుపల్లిలోని మునగ రామ్మోహన్‌రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ భవనాన్ని నిర్మించిన దాత డాక్టర్ మునగ రామ్మోహన్‌రావును మంత్రి అభినందించారు. అలాగే ల్యాబొరేటరీ, అదనపు గదుల నిర్మాణం, బాలికల టాయిలెట్లు తదితర అవసరాలను తీరుస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రఖ్యాత ఇంజినీరింగ్, ఐఐటీల్లో సీట్లు సాధించిన ఈ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ జయప్రద అబ్బాయి, డీఐవో వడ్డెన్న, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'పై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కోసం కళాశాలలోని ఐదు ఎన్ఎస్ఎస్ యూనిట్లు, బిస్లరీ కంపెనీ ప్రతినిధులు పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. బిస్లరీ కంపెనీ సీఎస్ఆర్ విభాగం ఎగ్జిక్యూటివ్ అనిల్‌కుమార్ మోరే హాజరై సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒక్కసారి ఉపయోగించి పారేస్తున్న ప్లాస్టిక్ భూమిలోకి చేరి తద్వారా భూసారం దెబ్బతింటుందన్నారు. అలాగే జంతువులు ఆహార పదార్థాలతో పాటు ప్లాస్టిక్‌ను సైతం తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఏకైక లక్ష్యంతో కుదుర్చుకున్న ఈ ఒప్పందం విద్యార్థుల్లో ఎంతో స్ఫూర్తిని రగిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నర్సింహులు, సరిత, మధుకర్, సరోజినీ చక్రవర్తి, ప్రసన్న, రఫియా సుల్తానా పాల్గొన్నారు. అనంతరం పరిశుభ్రతకు తమవంతు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు.



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ప్రసన్నలక్ష్మి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ వద్ద డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ స్రవంతి, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, ఎల్లయ్య, పొన్నాల రాజు, మహ్మద్, రవి, సంతోష్, శ్రీరామ్, నర్సింగ్, ఇస్మాయిల్, ప్రవీణ్, రామప్ప పాల్గొన్నారు.

కామర్స్‌లో విస్తృత అవకాశాలు

కాచిగూడ: నేటి పారిశ్రామిక ప్రపంచంలో సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా 'కామర్స్' విస్తృత అవకాశాలు గల రంగంగా ప్రాధాన్యతను సంతరించుకుందని భవన్స్ న్యూ సైన్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.జై కిషన్ అన్నారు. బుధవారం నారాయణగూడలోని కళాశాలలో ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు అధ్యక్షతన 'కామర్స్ ఫెస్ట్' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాణిజ్య శాస్త్రంలో నూతన టెక్నాలజీ ఉపయోగంపై వివరించారు. ఈ కామర్స్, డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సర్వీస్ తదితర రంగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్నా అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథానికి విజ్ఞానం జతచేస్తే ఉజ్వల భవిష్యత్తు ముందుంటుందన్నారు. హెచ్‌ఓడీ కె.అర్చన, ఎ.మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'లష్కర్'లో నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

నేటి గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన భారీ క్రేన్లు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 28 (నేడు) జరిగే గణేష్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. వందలాది విగ్రహాలను సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ట్యాంక్‌బండ్‌కు తరలించనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, జలమండలి, వైద్య ఆరోగ్య, పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేసింది. గణేష్ శోభాయాత్ర బయలుదేరే ముఖ్య కూడళ్లు, చౌరస్తాల్లో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అదే విధంగా ట్రాఫిక్ విభాగం అధికారులకు కూడా గణేష్ నిమజ్జనోత్సవ ర్యాలీలు వచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. రెండు మార్గాల గుండా సికింద్రాబాద్ వినాయక విగ్రహాలు ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డుకు తరలిపోనున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, క్లాక్ టవర్, ప్యాట్నీ చౌరస్తా ప్యారడైజ్ అదే విధంగా బాటా నుంచి ప్యాట్నీ చౌరస్తా ఎంజీ రోడ్డు, రాణిగంజ్, కర్బలామైదాన్, బుద్ధభవన్ నుంచి ట్యాంక్‌బండ్ హుస్సేన్‌సాగర్‌కు తరలిస్తారు. అదే విధంగా ముషీరాబాద్ చౌరస్తా, కవాడిగూడ, మ్యారీయేట్ హోటల్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్‌కు తరలిస్తారు.

సకల సౌకర్యాలు

గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోడానికి వీలుగా తమ విభాగాల తరఫున అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు విద్యుత్ డీఈ శ్రీధర్, ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, గాంధీనగర్ ఏసీపీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ ఎన్. రవి వెల్లడించారు. నిమజ్జనోత్సవ శోభాయాత్రలు వచ్చే ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలమన్నారు.

భారీ విగ్రహాలు..

సికింద్రాబాద్ మోండా మార్కెట్ టకారబస్తీ, అశోక్‌నగర్, బండిమేట్, ఆదయ్యనగర్, ఓల్డ్‌బోయిగూడ, పాన్‌బజార్, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలను నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌కు తరలిస్తారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆధ్వర్యంలో టకారబస్తీలో ఏర్పాటు చేసిన గణనాథుడు, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, శీలం ప్రభాకర్‌లతో పాటు బండిమేట్‌లో బీఆర్ఎస్ నాయకులు నాగులు, ఆదయ్యనగర్‌లో తలసాని స్కైలాబ్, అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు నాగేందర్ రాజ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథులు నిమజ్జనోత్సవం కోసం హుస్సేన్‌సాగర్‌కు తరలనున్నాయి.

ప్రభుత్వం తరఫున భారీ ఏర్పాట్లు: మంత్రి

గణేష్ నిమజ్జనోత్సవం కోసం ప్రభుత్వం తరఫున విస్తతమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గణేష్ శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ లైట్లు, మంచినీటి కేంద్రాలతో పాటు ట్రాఫిక్ జామ్ కాకుండా ఆయా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి తదితర విభాగాలు భారీ ఏర్పాట్లు చేశాయన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు, నిర్వాహకులు సహకరించాలన్నారు. ఇప్పటికే పలు రోడ్లు విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిల్లుతున్నాయి.